కాంగ్రెస్, బీజేపీవి దిగజారుడు రాజకీయాలు

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా జోరుగా ప్రచారం



నిజాంపేట్: దేవుడి మీద ఒట్లు వేస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. దేవుడి అక్షింతలంటూ ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను మభ్య పెడుతూ దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. నిజాంపేట కార్పొరేషన్ పరిధిలోని ఇందిరానగర్, రాజీవ్‌గాంధీ నగర్, సాయినగర్, ఇందిరమ్మ కాలనీ ఫేజ్–1, 2, రాజీవ్ గృహకల్ప ప్రాంతాల్లో మల్కాజిగిరి లోక్‌సభ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మల్కాజిగిరి ఎంపీగా, సీఎం అయ్యాక మల్కాజ్‌గిరికి రేవంత్‌రెడ్డి చేసిందేమీ లేదన్నారు.

◆ నిరుద్యోగ సమస్య తీరుస్తామంటూ గద్దెనెక్కిన బీజేపీ ప్రభుత్వంలో 18 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. గత పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వ మద్దతు లేకున్నా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిపారన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు రాజకీయాలే ముఖ్యం కానీ, ప్రజల బాగోగులు అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసీ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు ఆగం రాజు, బాలాజీ నాయక్, గాజుల సుజాత, మేకల వెంకటేశం, ప్రణయ, జ్యోతి, సీనియర్ నాయకులు చంద్రగిరి సతీష్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ శంభీపూర్‌లోని కార్యాలయంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌లు హాజరయ్యారు. దుండిగల్ మున్సిపాలిటీకి చెందిన మల్లంపేట్, భౌరంపేట్ కౌన్సిలర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ నెల 13న ఎన్నికల నేపథ్యంలో బూత్ ఇన్‌చార్జీలు, ఏజెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.



చిన్నారులతో సెల్ఫీ దిగుతున్న వివేకానంద్



బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్

ఓటరు నాడి దొరకట్లే ..!



- ఇప్పటికే రూ.కోట్లల్లో ఖర్చు చేసిన పెట్టిన పార్టీలు
- ఎవరిని అడిగినా మా ఓటు మీకే అంటున్న ఓటరు

సాక్షి, మేడ్చల్ జిల్లా: పోలింగ్‌కు మరో ఒక రోజు మాత్రమే ఉండటంతో నగరంతోసహా శివారులోని నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాల్లో పార్టీలన్నీ క్షేత్రస్థాయి ప్రచారం, ఇతరత్రా నిర్వహణ ఖర్చులకు నిత్యం రూ.కోట్లు ఖర్చుపెడుతున్నాయి. అయినా ఓటరు నాడి మాత్రం చిక్కడం లేదని ప్రధాన పార్టీల నాయకులు పేర్కొంటున్నారు. గతంలో పలు దఫాల్లో జరిగిన ఎన్నికల్లో పోల్ మేనేజ్‌మెంట్ చేసిన నాయకులు కూడా ఇలాంటి పరిస్థితిని ఎన్నడూ చూడలేదని వెల్లడిస్తుండటం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది. గతంలో ఉన్నట్లుగా నేతలు చెబితే పార్టీ కార్యకర్తలు ఓటేసే పరిస్థితులు క్షేత్రస్థాయిలో లేకపోవడంతో పోటీ చేసే అభ్యర్థులు చాలా చోట్ల తమ రెండో శ్రేణి నాయకులను కాకుండా నేరుగా ఓటర్లనే నమ్ముకుంటున్నారు. గతంలో డబ్బులు ఇచ్చిన ఓటర్లు తమకే ఓటు వేస్తామని ప్రమాణాలు చేసేవారని... ఇప్పుడు ఎంత ఖర్చు పెట్టినా ఎవరికి ఓటు వేస్తారో ఓటర్లు చెప్పడం లేదని ఓ ప్రధాన పార్టీకి చెందిన సీనియర్ నాయకుడు అభిప్రాయపడ్డారు.

ఎవరు అడిగితే వారికే మద్దతు

ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచి అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీజేపీ, బీజేపీ అభ్యర్థులతో పాటూ చిన్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు కూడా ప్రచారం నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు కావటంతో .. కొన్ని చోట్ల పార్టీలు ఇంటింటి ప్రచారాన్ని ఇంకా నిర్వహిస్తున్నాయి. అయితే ఓటరు దగ్గరికి ఏ పార్టీ వారు వెళ్లి ఓటును అడిగినా వారికే మా ఓటు అని చెబుతున్నా నమ్మకం కలగడం లేదని ప్రధాన పార్టీల నాయకులు పేర్కొంటున్నారు. 'నేను గత నాలుగు సార్వత్రిక ఎన్నికలు చూశా... ప్రచారానికి ప్రజల్లోకి వెళితే మాకు పరిస్థితి కొంత అర్థం అయ్యేది. ఇప్పుడు ఎంత ఖర్చు చేసినా ఈ ఓట్లు మాకే పడుతాయనే నమ్మకం కుదరడం లేదంటున్నారు. డబ్బులిస్తే తీసుకుంటున్నారు... తప్పితే మీకే మా మద్దతు అని స్పష్టంగా చెప్పడం లేదని ఓ ప్రధాన పార్టీ నుంచి వరుసగా మూడోసారి ఎన్నికల ప్రచారంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న నాయకుడొకరు వెల్లడించారు. ఎదుటి పార్టీలో ఉన్న మిత్రులనూ సంప్రదిస్తే వారు ఇదే అభిప్రాయాన్ని వెల్లడిస్తున్నారని పేర్కొనటం కొసమెరుపు.

అన్ని వర్గాలతో మంతనాలు

క్షేత్రస్థాయిలో రోడ్‌షోలు, ఎన్నికల సభలు, సామాజిక వర్గాల సమ్మేళనాలు, ఎన్నికల ప్రచారం ముగింపు దశకు చేరిన నేపథ్యంలో గ్రేటర్‌తోసహా శివారు మల్కాజిగిరి, సికింద్రాబాద్, చెవేళ్ల పార్లమెంట్ నియోజకవర్గాల్లో అన్ని పార్టీల నాయకులు గంపగుత్త కొనుగోళ్లకే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ఓటరు నాడిని పట్టుకునేందుకు ఓ వైపు ముమ్మర ప్రయత్నం చేస్తూనే.. మహిళా సంఘాలు, సామాజికవర్గాలు, అపార్టుమెంట్లు,కాలనీలు,అసోసియేషన్లు, కార్మిక ,ఉద్యోగ సంఘాలు తదితర వాటితో మంతనాలు సాగిస్తున్నారు. దగ్గరి బంధువులు, సోదరులు తొలుత వీరితో మాట్లాడి ఓ 'ధర' నిర్ణయిస్తే చివరకు సదరు ప్రధాన పార్టీ అభ్యర్థి వచ్చి వారితో మాట్లాడి మద్దతివ్వాలని.. గెలిచిన అనంతరం పెద్ద ఎత్తున ఏది కావాలంటే అది చేస్తానని చెప్పి నిర్ణయించిన దాంట్లో 50 శాతం చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే చాలా చోట్ల తొలి విడత మంతనాలు పూర్తి కాగా... చివరి రోజుల్లో వారికి చెల్లింపులు జరగనున్నాయి.

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్

నిజాంపేట్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ విధిస్తూ సైబరాబాద్ కమిషనర్ అవినాష్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 11వ తేదీ సాయంత్రం 6గంటల నుంచి 14వ తేదీ సాయంత్రం 6గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఐదుగురు వ్యక్తులకు మించి గుమిగూడినా, సమావేశాలు నిర్వహించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పోలీస్ ఉన్నతాధికారులు హెచ్చరించారు. అయితే ఇంటింటి ఎన్నికల ప్రచారం చేసే క్రమంలో రాజకీయ పక్షాలు ఐదుగురికి మించి ఉండకూడదని స్పష్టం చేశారు.

ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలి

జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఎన్నికల నిర్వహణ సజావుగా, పారదర్శకంగా జరిగేలా బాధ్యతాయుతంగా పనిచేయాలని మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ ,ఎల్బీనగర్,కంటోన్మెంట్ ఏఆర్వోలకు తగిన సలహాలు, సూచనలు చేశారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతీ అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఓటర్ స్లిప్‌లను 100 శాతం పంపిణీ జరిగేలా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. ఏఆర్ఓ లు పోలింగ్ కేంద్రాలను సందర్శించి వాటిని పరిశీలించాలన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొన్న సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు.

సక్రమంగా విధులు చేపట్టాలి

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా నియమ నిబంధనలను అనుసరించి నోడల్, పోలీస్ అధికారులు తమకు కేటాయించిన విధులను సమన్వయంతో చేపట్టాలని జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ సూచించారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ముందుస్తుగానే పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ఎస్ఎస్‌టీ , ఎఫ్ఎస్‌టీ,వీఎస్‌టీ , అకౌంటింగ్ టీమ్‌లు,ఎంసీఎంసీ , ఎక్స్పెజ్ అధికారులు సమర్ధవంతంగా బాధ్యతలు నిర్వహించాలన్నారు. పోలింగ్‌స్టేషన్ రూట్‌లలో ఎన్నికల నిర్వహణ సామాగ్రిని సంబంధిత సెక్టోరియల్, ప్రీసైడింగ్ అధికారులు ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా మెటీరియల్ పంపిణీ చేయాలన్నారు .ప్రతీ పోలింగ్ కేంద్రంలో సీసీటీవీలు ఏర్పాటు చేయాలన్నారు. బీఎల్‌ఓలు ఓటరు స్లిప్పులను వంద శాతం పంపిణీ చేసేలా చూడాలన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతీ పోలింగ్ కేంద్రంలో అవసరమైన మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచాలన్నారు. చల్లటి తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, 108 అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో షామియానాలు, కుర్చీలు, టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు.ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపు ,వీల్ చైర్ లు ఏర్పాటు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.100 మీటర్ల దూరం లైన్ మార్క్ ఉండాలన్నారు. పోలింగ్ రోజు ఉదయం ఐదు గంటలకు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోల్ నిర్వహించాలన్నారు. సెల్ ఫోన్లు అనుమతించ కూడదన్నారు. లా అండ్ ఆర్డర్ అదుపులో పెట్టే బాధ్యత పోలీస్ యంత్రాంగంపై ఉందన్నారు. రాష్ట్ర సరిహద్దుల్లో ఏర్పాటుచేసిన చెక్ పోస్టులు ఎన్నికలు పూర్తయ్యే వరకు కొనసాగుతాయని తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉండాలన్నారు.

నేటి సాయంత్రం 6గంటల నుంచి వైన్స్ బంద్

కుత్బుల్లాపూర్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 11వ తేదీ సాయంత్రం 6గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 5గంటలకు మద్యం షాపులను మూసివేయాలని సైబరాబాద్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని బాచుపల్లి, జగద్గిరిగుట్ట, దుండిగల్, సూరారం, జీడిమెట్ల, పేట్ బషీరాబాద్ పోలీసులు ఇప్పటికే అన్ని మద్యం, బార్, రెస్టారెంట్‌లకు సమాచారం ఇచ్చారు. అయితే ఎన్నికల నేపథ్యంలో వివిధ రాజకీయ పక్షాలు మద్యం నిల్వలు పెద్ద ఎత్తున చేసుకునే అవకాశాలు ఉన్న నేపథ్యంలో ప్రత్యేకంగా ఎస్ఓటీ, టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. భారీ సంఖ్యలో మద్యం కొనుగోలు చేసే వారిపై కన్నేసి ఉంచుతున్నారు. ఆయా ప్రాంతాల్లో బ్లాక్ అడ్డాల ద్వారా మద్యం విక్రయించే వారిపై సైతం దాడులు చేసేందుకు ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఏది ఏమైనా ఎన్నికల నేపథ్యంలో మద్యం అమ్మకాలతో పాటు వాటిని బ్లాక్‌లో విక్రయించే వారిపై కేసులు నమోదు చేసేందుకు సిద్ధమయ్యారు.

మహిళా సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యం



నారీ న్యాయ సమ్మేళనంలో మాట్లాడుతున్న కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ మల్కాజ్‌గిరి అభ్యర్థి సునీతారెడ్డి, జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబ



షాకీర్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారితో శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: మహిళా సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంటరీ నారీ న్యాయ సమ్మేళనం శుక్రవారం కొంపల్లిలోని కేవీఆర్ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబ, మల్కాజ్‌గిరి అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డిలు పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు లబ్ధి చేకూరుతోందన్నారు. రాహుల్ గాంధీ ప్రధాని అయితే ప్రతి మహిళకు ఏడాదికి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందుతుందన్నారు.

ఆరు గ్యారంటీలే గెలిపిస్తాయి...

◆ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలే పార్టీ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించే బాధ్యత మహిళలపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తమిళనాడు ఎంపీ జ్యోతిమణి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు భూపతిరెడ్డి, జ్యోత్స్నారెడ్డి, పున్నారెడ్డి, టీపీసీసీ కో.ఆర్డినేటర్ శోభారాణి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతరావు, నిజాంపేట్ మేయర్ నీలారెడ్డి, జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి, కాంగ్రెస్ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి బీఆర్ఎస్ నేతలు...

◆ బీఆర్ఎస్ పార్టీకి చెందిన షాకీర్ ఆధ్వర్యంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం షాపూర్‌నగర్‌లోని నివాసంలో శ్రీశైలంగౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

120 గజాల ప్రాంతం.. మురుగుతో సతమతం

సుభాష్‌నగర్: ఇటీవల కురిసిన వర్షంతో దూలపల్లిలోని 120 గజాల్లో డ్రైనేజీ లైన్‌లు జామై మురుగు వీధుల్లో నిండిపోయింది. గత రెండు రోజులుగా ఇళ్లల్లోని మురుగు బయటకు వెళ్లకుండా వెనక్కి వస్తోందని.. ఇప్పుడే ఇలా ఉంటే వర్షాకాలంలో తమ పరిస్థితి ఎలా ఉంటుందోనని స్థానికులు జంకుతున్నారు. పాత డ్రైనేజీ లైన్‌ను విస్తరించి మురుగు సాఫీగా వెళ్లేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బస్తీ అధ్యక్షుడు పూజారి మహేష్ కోరుతున్నారు.



దూలపల్లి 120 గజాల్లోని ఓ ఇంట్లోకి చేరిన మురుగు

'మల్కాజ్‌గిరి'కి ఇండస్ట్రియల్ కారిడార్ తీసుకొస్తా

- మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్
- కుత్బుల్లాపూర్, జగద్గిరిగుట్ట ప్రాంతాల్లో రోడ్ షో



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపాలనే ఉద్దేశంతోనే ప్రజలు మాజీ సీఎం కేసీఆర్‌ను ఓడించారని, ఆ పార్టీ నుంచి ఎంపీలుగా గెలిచినా వారు చేసేదేమీ లేదని మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ అన్నారు. కుత్బుల్లాపూర్, జగద్గిరిగుట్ట ప్రాంతాల్లో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. 13వ తేదీన జరిగే ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేసి మరోసారి ప్రధాని నరేంద్ర మోదీని గెలిపించాలన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకత కారణంగా ప్రజలు తిరస్కరించారని తెలిపారు. ఈ ఎన్నికల్లో సైతం బీఆర్ఎస్‌ను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి మహిళకు రూ.2,500, వృద్ధులను రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేల పింఛన్, మహిళా సంఘాలకు రూ.10 లక్షల రుణమాఫీ వంటి ఎన్నో పథకాలను ప్రవేశపెడతామని చెప్పిందన్నారు. కానీ ఇప్పటి వరకు పకడ్బందీగా ఒక్క హామీ కూడా అమలు చేయలేదన్నారు. తనను గెలిపిస్తే మల్కాజిగిరికి రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ, ఇండస్ట్రియల్ కారిడార్ తీసుకొచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే కార్మికులకు న్యాయం



కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కార్మిక నేత చింతల నాగరాజు

కుత్బుల్లాపూర్: కార్మికుల హక్కులను కాలరాస్తు కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తోందని రాష్ట్ర కార్మిక నేత చింతల నాగరాజు అన్నారు. మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. అందులో భాగంగా జీడిమెట్ల పారిశ్రామికవాడలో పలు యూనియన్లకు అధ్యక్షుడిగా ప్రాతినిధ్యం వహిస్తున్న చింతల నాగరాజు ఆయా పరిశ్రమల నిర్వాహకులు, కార్మికులతో సమావేశయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే కార్మికులకు న్యాయం జరుగుతుందన్నారు. కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సైనర్ లేబరేటీస్ కంపెనీ డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్, హెచ్ఆర్ నాగమణి, వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ రాజు, జనరల్ సెక్రటరీ శ్రీనివాస్, నిరంజన్, రాంబాబు, మురళి, శేఖర్, మూర్తి, శ్రీధర్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలకు రక్షణేది?

ప్రార్థన మందిరాల ముసుగులో సర్కారు భూముల కబ్జాలు

- నెల క్రితం రాత్రికి రాత్రే రేకుల షెడ్డు నిర్మాణం
- దీనిపై పత్రికల్లో కథనాలు ప్రచురితమైనా పట్టించుకోని అధికారులు
- ఏపీహెచ్‌బీ కాలనీవాసులు అడ్డుకోవడంతో ఆగిన ప్రహరీ నిర్మాణం



ఏపీహెచ్‌బీ కమాన్ పక్కనే ప్రభుత్వ స్థలంలో ఏర్పాటు చేసిన మజర్.. తిష్టవేసిన ఆక్రమణదారులు

రంగారెడ్డినగర్: ప్రార్థనా మందిరాల ముసుగులో ప్రభుత్వ స్థలాల కబ్జాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి. రంగారెడ్డినగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీకి ఆనుకుని ఐడీపీఎల్– జగద్గిరిగుట్ట రోడ్డులోని ప్రభుత్వ స్థలంలో కొద్ది రోజుల క్రితం కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రి మజర్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఈ విషయమై జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు వదిలేయడంతో సదరు స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు. నెల రోజుల క్రితం మజర్‌ను ఆనుకుని 100 గజాల స్థలంలో రేకుల షెడ్డును రాత్రికి రాత్రి చడీచప్పుడు కాకుండా ఏర్పాటు చేశారు. ఈ విషయమై 'సాక్షి'లో కథనం ప్రచురితమైనా అధికారుల్లో చడీచప్పుడు లేదు. పదిహేను రోజుల క్రితం సదరు ఆక్రమణదారులు మజర్ చుట్టుపక్కల ఉన్న స్థలాన్ని శాశ్వత ప్రాతిపదిక కబ్జా చేసేందుకు ఉపక్రమించారు. ప్రార్థన స్థలం చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు యత్నించగా ఏపీహెచ్‌బీ కాలనీవాసులు అడ్డుకున్నారు.

అధికారుల ఫిర్యాదుతో ఆగిన నిర్మాణం..

ఏపీహెచ్‌బీకాలనీకి ఆనుకుని గోడ నిర్మిస్తుండటంతో కాలనీ అసోసియేషన్ అడ్డు చెప్పింది. సదరు ఆక్రమణదారులు బెదిరింపులకు పాల్పడటంతో అసోసియేషన్ సభ్యులు కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నరసింహకు, జీడిమెట్ల పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. దీంతో అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని నిర్మాణాన్ని అడ్డుకున్నారు.

అధికారులు హెచ్చరించినా స్థలంలోనే పాగా..

అధికారులు ఎన్నికల హడావుడిలో బీజీబీజీగా ఉండటంతో అక్రమణదారులు తిరిగి నిర్మాణం చేపట్టేందుకు యత్నిస్తున్నారు. రోజు కబ్జా చేసిన స్థలంలో నలుగురైదుగురు కుర్చీలు వేసుకుని తమ స్థలంగా హడావుడి చేయడం గమనార్హం. సర్కిల్ అధికారులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరించకుంటే లక్షలాది రూపాయల ప్రభుత్వ స్థలం కబ్జా చెరలో శాశ్వతంగా చిక్కుకునే ప్రమాదం పొంచి ఉంది.

స్థానికంగా ఉండే భవన యజమానే సూత్రధారి..

ప్రభుత్వ స్థలంలో అక్రమంగా ఏర్పాటు చేసిన మజర్ వెనుక ఏపీహెచ్‌బీ కాలనీ ప్రధాన రోడ్డులోని ఓ భవన యజమాని సూత్రధారిగా తెలుస్తోంది. స్థానికంగా రోడ్డు పక్కగా ఉన్న ఓ వర్గానికి చెందిన కొన్ని దుకాణ సముదాయాల నిర్వాహకులతో కుమ్మక్కై ప్రభుత్వ స్థలాన్ని అప్పన్నంగా మజర్ పేరుతో కబ్జా చేసేందుకు ప్రణాళిక రూపొందించుకున్నట్లు సమాచారం.

రైతన్నే.. గెలుపు నిర్ణేత

మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో రైతు కుటుంబాలు 47,506



సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం అర్బన్,సెమీ అర్బన్ ప్రాంతంగా ఉన్నప్పటికీ ఇక్కడ ఉద్యానవన పంటలు సాగు చేసే రైతు కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపు, ఓటమిలపై వీరి ప్రభావం ఉండగలదన్న చర్చ రాజకీయ పార్టీల్లో వ్యక్తమవుతోంది.

సాయం పొందుతున్న రైతులు 47,506

ఆరు నెలలకు ఒకసారి ప్రభుత్వం అందించే పంట సాయం కింద రూ.40 కోట్లు రైతు బంధు తీసుకుంటున్న రైతుల సంఖ్య 47,506 ఉన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం ఎన్నికల్లో పార్టీల అభ్యర్థుల గెలుపు ఓటమిలపై వీరి ప్రభావం ఉండగలదని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. రైతులపై ఆధారపడి జీవించే వ్యవసాయ కూలీల కుటుంబాలు కూడా ఉన్నాయి. జిల్లాలోని ఘట్‌కేసర్‌లో 6,884 మంది రైతులు ఉండగా, కాప్రాలో 139, కీసరలో 7,667, మేడ్చల్‌లో 11,441, మేడిపల్లిలో 387, మూడుచింతలపల్లిలో7,627, అల్వాల్‌లో 319, బాచుపల్లిలో 113, దుండిగల్ గండిమైసమ్మ మండలంలో 4,018 మంది, కూకట్‌పల్లిలో 20, కుత్బుల్లాపూర్‌లో 230, ఉప్పల్ మండలంలో 242 మంది మొత్తంగా 47,506 మంది రైతులు ఉన్నారు. ఇందులో 28 వేల మంది సన్న ,చిన్నకారు రైతులు ఉండగా, మిగతా రైతులు అంతా ధనిక వర్గాలకు చెందిన వారేనని జిల్లా వ్యవసాయ శాఖ లెక్కలు చెబుతున్నాయి.

దోస్త్ అడ్మిషన్లు ప్రారంభం

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి దోస్త్ అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అలివేలు మంగమ్మ ఓ ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకామ్, బీఎస్సీ(ఎంపీసీ, బీజెడ్‌సీ) కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని, ఔత్సాహిక విద్యార్థులు ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు బహదూర్‌పల్లి చౌరస్తాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

కుత్బుల్లాపూర్: ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన పాశ్వాన్(27) బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చి 8 నెలల క్రితం మైసమ్మగూడలోని శేఖర్ అనే వ్యక్తి వద్ద బర్రెల కాపరీగా పనిలో చేరాడు. రోజు మాదిరిగానే శుక్రవారం గేదెలను మేపేందుకు స్థానికంగా ఉన్న అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లాడు.

◆ ఈ నేపథ్యంలో గేదెలు కోమటి చెరువులోకి దిగడంతో వాటిని బయటకు రప్పించేందుకు చెరువు గట్టుమీద నిలబడి కర్రతో కొడుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారి పాశ్వాన్ చెరువులో పడిపోయాడు. అతనికి ఈత రాకపోవడంతో చెరువులో మునిగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సభ్యులు పడవల సహాయంతో నాలుగు గంటల పాటు శ్రమించి మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.